పట్టణ సిఐగా క్రాంతికుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణ నూతన సిఐగా క్రాంతి కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. క్రాంతి కుమార్ గతంలో జిల్లాలో మండపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. కాకినాడ క్రైమ్ బ్రాంచ్ లో విధులు నిర్వహిస్తున్న క్రాంతి కుమార్ ను అమలాపురం పట్టణ సిఐ గా నియమితులయ్యారు. అమలాపురం పట్టణ సిఐగా పనిచేసిన డి.దుర్గా శేఖర్ రెడ్డి విఆర్‌పై వెళ్లిన సంగతి తెలిసిందే.

క్రాంతికుమార్, సిఐ

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్

వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి వామపక్ష పార్టీల నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, సిపిఎంఎల్ సీనియర్ నాయకులు మచ్చా నాగయ్య మాట్లాడుతూ వేసవి గడిచినా విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయన్నారు. ప్రతినెలా ఛార్జీలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని విద్యుత్ దోపిడీ సాగిస్తున్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని, 200 యూనిట్ల వరకు అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తానని వైసిపి మాట ఇచ్చి నమ్మకద్రోహం చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వివిధ రూపాలలో విద్యుత్ భారాలు మోపుతుందని ఛార్జీల పెంపు, ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం, ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, అదనపు డిపాజిట్లు ఇలా రకరకాల పేర్లతో ప్రజలను కొల్లగొడుతున్నదన్నారు. ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలు పెంచే విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. రైతుల ఉచిత విద్యుత్ కు ఎసరు పెడుతున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, వృత్తిదారులకు ఇస్తున్న రాయితీలకు కోత పెడుతున్నారన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి రానున్న కాలంలో సబ్సిడీ ఎత్తివేయాలని ఆలోచిస్తోందన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడానికి టెండర్లు పిలిచారనీ అదాని తదితర కార్పొరేట్లకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టారన్నారు. ముందుగానే విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రీపెయిడ్ విధానం ప్రవేశపెడుతున్నారనీ స్మార్ట్ మీటర్ల కయ్యే రూ.వేలు వినియోగదారులే భరించాలని, రాత్రిపూట వినియోగించుకునే కరెంటుకు అదనపు బిల్లులు వేసే ప్రమాదకర విధానం తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం విద్యుత్ చట్టానికి సవరణల ప్రతిపాదనలు పార్లమెంటు ముందున్నాయన్నారు. విద్యుత్ రంగాన్ని అదాని, కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి, కార్పొరేట్లకు పూర్తిగా లొంగిపోయిందని గతంలోని ప్రభుత్వాలు అడ్డగోలుగా బడా కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షిస్తామని మాట ఇచ్చి నేడు వైసిపి అదే బాటలో ప్రయాణిస్తున్నదన్నారు. 30 సంవత్సరాల పాటు వ్యవసాయ విద్యుత్తు అందించే కాంట్రాక్టును కట్ట పెట్టారని అన్నారు. 2000 సంవత్సరంలో వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడారని ముగ్గురు కార్యకర్తలు ప్రాణాలర్పించారన్నారు. ప్రజలు తిరస్కరించిన ప్రపంచ బ్యాంకు సంస్కరణలను నేడు కేంద్రం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ రంగం పూర్తిగా కార్పొరేట్ల కబంధహస్తాల్లోకి వెళుతున్నదన్నారు. ఛార్జీలు మరింతగా భారం కానున్నాయని, తక్షణం విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని విద్యుత్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలంతా ఛార్జీల భారం తగ్గింపు కొరకు, ప్రమాదకరమైన కార్పొరేటీకరణ విధానాల రద్దు కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అలాగే రాష్ట్రంలోనూ దేశంలోనూ ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు పీతల రామచంద్రరావు, దైవదాని, విప్పర్తి మోహనరావు, పాము బాలయ్య, తాడి శ్రీరామమూర్తి, తులసీరావు, ఊటాల వెంకటేష్, కంచె సత్యనారాయణ, బీమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అక్రమ ఆక్వా చెరువులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-కాట్రేనికోన

అక్రమ ఆక్వా చెరువులు నిలుపుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంద్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండల పరిధిలోని దొంతుకురు గ్రామపంచాయతీ పరిధిలో అడవిపేట గ్రామానికి అతి సమీపంలో అక్రమంగా ఆక్వా చెరువు తవ్వడానికి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబిదారీగా ఉండవలసిన అవసరం ఉన్నప్పటికీ, ప్రజల యోగక్షేమాలు గురించి ఆలోచన చేయకుండా గ్రామానికి నష్టం కలిగించే పనులు చేయడాన్ని సిపిఎం ఖండిస్తోందని అన్నారు. గ్రామానికి ఎలిమెంటరీ స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాలు అతీ సమీపంలో ఉన్నాయని ఆక్వా చెరువులు తవ్వుతే గనుక విద్యా ర్థులు విద్యకు దూరం కావాల్సి వస్తుందని, చెరువులో పెట్టే ఇంజన్ శబ్దం వలన విద్యకు ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు కలగజేసుకుని అక్రమ ఆక్వా చెరువు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పనులు నిలుపుదల విషయమై రాష్ట్ర మత్స్యశాఖ అధికారులతో ఫోన్లో మల్యాద్రి మాట్లాడారు. లేనియెడల ఈ ఉద్యమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ఉధతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, మండల సిపిఎం నాయకులు విపర్తి మోహన్‌రావు, గ్రామ పెద్దలు జి.వెంకటేశ్వరరావు, బి. వెంకటరమణ, నాగ ముని, శ్రీనివాసరావు, రమేష్, రాజేష్, అంబేద్కర్, సత్తిరాజు, మూలస్వామి, గ్రామమహిళలు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వాచెరువులు పరిశీలిస్తున్న ఆంద్రా మాల్యాద్రి

పంట రుణాల కోసం కౌలురైతుల ధర్నా

ప్రజాశక్తి -అమలాపురం

కౌలురైతులకు పంటరుణాలు ఇవ్వాలని కోరుతూ అమలాపురం లో యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం కౌలురైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో 46 వేల మందికి పైగా పంట సాగు హక్కు పత్రాలు ఇచ్చారని, భూమిలేని కౌలురైతులు వీరందరికీ వడ్డీ రాయితీతో కూడిన పంట రుణాలు కౌలురైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ యజమాని ఆధార్, సంతకాలతో పనిలేకుండా సిసిఆర్ కార్డు ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటరుణం ఇవ్వాలని రూ.1.6 లక్షల వరకు హామీ లేని రుణాలు ఇవ్వాలని, జె.ఎల్ గ్రూపులన్నింటికి తిరిగి రుణం ఇవ్వాలని, బ్యాంకుల వారీ కౌలురైతులకు టార్గెట్ లు నిర్ణయించి అమలు చేయాలని, అక్టోబర్ లో 10 రోజుల పాటు పంట రుణమేలాలు నిర్వహించి కౌలురైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో కౌలురైతుల సంఘం ప్రజా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గా ప్రసాద్, తాడి శ్రీరాం, మూర్తి, మోహనరావు, పర్వతాలు, సత్యనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ ప్రతుల దహనం

ప్రజాశక్తి-అమలాపురం

జిపిఎస్ వద్దని పాత ఫంక్షన్ విధానమే కొనసాగించాలని ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై అమలాపురం పట్టణం స్థానిక హైస్కూల్ సెంటర్లో యుటిఎఫ్ నాయకులు జిపిఎస్ బిల్లు ప్రతులను తగలబెట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి బసు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు సి పి ఎస్ ను వ్యతిరేకించి ఒపిఎస్ కోరుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా జిపిఎస్‌ను ఆమోదించడంపై జిల్లా యుటిఎఫ్ శాఖ వ్యతిరేకిస్తుందని ఇది ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చీకటి రోజు అని అన్నారు. వెంటనే ఈ జిపిఎస్ బిల్లును రద్దు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మురుగేశ్వరరావు, పెన్నాడ శ్రీనివాసరావు, ఉప్పలగుప్తం మండల శాఖ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం సురేష్ కుమార్ అమలాపురం రూరల్ మండలం అధ్యక్షులు శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు కృష్ణకుమారి, నాగ శ్రీదేవి, వసంత, బిఎన్.వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, జివి.శ్రీనివాస్, బి.వేణుగోపాల్, జి.త్రినాథ్ కుమార్ ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులను తగలబెడుతున్న యుటిఎఫ్ నాయకులు

బిసి కులగణన చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వం తక్షణం బిసి కులగణన చేపట్టాలని బిసి సేన నాయకులు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్రాక్షారామంలో ఏర్పాటు చేసిన సత్యశోధకు సమాజ్ 151వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సతీమణి సావిత్రీబాయి పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించిన సత్యశోధక్ సమాజ్ అనే సంస్థ ను మహారాష్ట్ర పూణే లో 1873 సెప్టెంబర్ 24న స్థాపించారని ఆయన తెలిపారు . ద్రాక్షారామ మసీదు సెంటర్ లో గల పూలే దంపతుల విగ్రహాలకు కమిటీ సభ్యులు కానీల వీరభద్రరావు, వేమవరపు రాంబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు.

సమావేశంలోపాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోటిపల్లి రేవు నిర్వహణకు జాయింట్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత ఆరు నెలలుగా బహిరంగ వేలం నిర్వహణ జరగకుండా నిలిచి పోయిన కోటిపల్లి రేవు నిర్వహణకు జిల్లా పరిషత్ ఆదేశాలతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు జాయింట్ కమిటీ ఛైర్మన్‌గా మండల పరిషత్ అధ్యక్షులు పంపన నాగమణి, సభ్యులుగా జెడ్‌పిటిసి సభ్యురాలు ఓబులనేని వరలక్ష్మి, డిఎల్‌పిఒ ఎం. రామకృష్ణారెడ్డిలను నియమించారు. వీరందరూ చేత మండల పరిషత్ ఆదాయం పెంచేందుకు ప్రభుత్వ నిబంధన అమలుకు కృషి చేస్తామని ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ అక్టోబర్ మొదటి వారంలో సమావేశం ఏర్పాటు చేసి రేవు నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఎంపిడిఒ వివరించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం బహిరంగ వేలం నిర్వహించి అధిక పాటదారునికి రేవును అప్పగిస్తామని ఆయన వివరించారు. నూతనంగా ఏర్పాటైన కమిటీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ప్రకాష్, ఎఒ ఎం. శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పంపన సుబ్బారావు ఓబులనేని రాజకుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వాడివేడిగా మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి -అమలాపురం

ప్రతి మున్సిపల్ సమావేశంలో తన వార్డు పరిధిలోని వాటర్ విభాగం కార్యాలయం వద్ద డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడంలేదని బుధవారం జరిగిన సాధారణ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వైసిపి మున్సిపల్ కౌన్సిలర్ యండమూరి గంగా శ్రీను అధికారుల నిలదీశారు. ఎన్నిసార్లు అడిగినా అధికారులు సమాధానం దాటవేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వికాస్ ద్వారా మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు విడుదల చేయాలని ఆమె కోరారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో టిడిపి, జనసేన కౌన్సిలర్లు సమావేశం నుండి బాయ్ కాట్ చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టు ను నిరసిస్తూ కౌన్సిల్ సమావేశం లో నాదాలు చేశారు.ప్రతిగా వైసీపీ కౌన్సిలర్లు పోటి నినాదాలు చేయడంతో సభలో కొద్దిసేపు గందర గోళం నెలకొంది. ళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ తక్షణమే చర్యలు చేపట్టండి కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించగా అక్టోబర్ 10 వ తేదీ నాటికీ సమస్య పరిష్కారం అవుతుందనికమిషనర్ నాయుడు తెలిపారు. చేసిన పనులకు కొత్తగా బిల్లులు చేస్తున్నారనీ అసలు మీరు పనులను పర్యవేక్షిస్తున్నారా అని అధికారులను వైసిపి కౌన్సిలర్ గోవ్వాల రాజేష్ ప్రశ్నించారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ సాధించినందుకు మనం అందరం గర్వపడాలని మున్సిపల్ కౌన్సిలర్ దొంగ సుధారాణి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ నాయుడు, పురపాలక సంఘ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ యండమూరి గంగ

కొనసాగిన టిడిపి శ్రేణుల నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా బుధవారం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు.

మండపేట చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి దీక్ష ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, షేక్ సల్మాన్ తదితరులు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. **మండపేట** చంద్రబాబు కేసులనుంచి విముక్తి పొందాలని మండపేట కు చెందిన విప్పర్తి ప్రశాంత్ గౌరీపట్నం సైకిల్ యాత్ర ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టాడు. గౌరీపట్నం చేరుకుని మోకాళ్ళపై మెట్ల ద్వారా మేరీ మాత వద్దకు చేరుకుని చంద్రబాబు కోసం ప్రార్ధన చేస్తానని ప్రశాంత్ అన్నాడు. **ఉప్పలగుప్తం** చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేశారంటూ టిడిపి నాయకులు ధ్వజ మెత్తారు. చంద్రబాబు అరెస్టు ను నిరసిస్తూ బుధ వారం రాత్రి ఉప్పలగుప్తంలో టిడిపి మండల అధ్య క్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి కొల్లు శ్యాంసుందర్, నాయకులు నిమ్మకాయల జగ్గయ్య నాయుడు, పరమట శ్యామ్ కుమార్, చిల్లా రవణం మధు, పెయ్యల దుర్గారావు, గాలిదేవర సురేష తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తంలో టిడిపినాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన

మాట్లాడుతున్న చైర్పర్సన్ కోటేశ్వరరావు

అభివృద్ధి పథంలో 'వెలగతోడు' సొసైటీ

ప్రజాశక్తి -మండపేట

మండలంలోని వెలగతోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఛైర్‌పర్సన్ ముక్కపాటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం వెలగతోడు సొసైటీ వద్ద మహాజనసభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి త్రిసభ్య కమిటీ సభ్యులు పిల్లిల్లి చిన్నఅప్పారావు, చిటికిన వీర్రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సంఘం యొక్క నికర లాభం 2022-23 సంవత్సరానికిగాను రూ.16లక్షల ఆర్జించగా, సంఘ బైలా నెంబర్ 35 ప్రకారం పంపకం చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 31 నాటికి 654 మంది రైతులకు సుమారు రూ.7 కోట్ల రుణాలు అందించామన్నారు. సభ్యుల వద్ద నుంచి డిపాజిట్ల సేకరణకు కషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పుట్టా వెంట్రారావు, తుమ్మా వీరబాబు సిఇఒ చుండ్రు పాపారావు, వంకా కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కేశవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-మండపేట

మండలంలో కేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం కొనసాగింది. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆయుష్మాన్ భవ కార్డులను ప్రజలకు అందజేస్తున్నారు. త్వరితన సర్వేలు పూర్తి చేస్తామని వైద్యాధికారి లత తెలిపారు.

రూ. 20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో మూడు చోట్ల నూతన సిసి రోడ్ల నిర్మాణాన్ని బుధవారం సర్పంచ్ గుణ్ణం రాంబాబు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా గ్రామానికి విడుదలైన రూ.20 లక్షలతో ఎస్‌సి కాలనీలో రెండు చోట్ల, అలాగే గ్రామ సచివాలయానికి వెళ్లే మార్గాన్ని సిసి రోడ్లుగా మారుస్తున్నందుకు సంతోషంగా ఉందని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివద్ధి కోసం ఈ నిధులను అందించిన ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'యువగళం' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాజోలులో ఈనెల 29 నుంచి తిరిగి ప్రారంభం కానున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రవేశించనున్న నేపథ్యంలో ఆ పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంఎల్‌ఎ, అమలాపురం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన బుధవారం టిడిపి మండల సమావేశం నిర్వహించారు. యువగళం పాదయాత్రకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు తరలి వచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కషిచేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లు శ్యాంసుందర్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు నల్లా బాపండి,గుత్తుల నాగేశ్వరరావు, లంకే భీమరాజు, గొలకోటి చిన్న, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, చిక్కం పెద్దబ్బులు, పెయ్యల దుర్గారావు, అడబాల సత్యనారాయణ, మద్దింశెట్టి సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీనివాస'లో కృతిమ మేధపై అవగాహన

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల్లో 'భవిష్యత్, వర్తమానంలో కృత్రిమమేధ ప్రభావం" అనే అంశంపై పై అవగాహనా సదస్సును ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డా.కెపియెన్‌వి.సత్య శ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మానువుడు తయారుచేసుకున్న మేధస్సు కృత్రిమ మేధ అని అన్నారు. ఎఐ సహాయంతో ఎక్కువ సమాచారాన్ని విశ్లేషించుట ముఖ్యంగా వైద్య రంగంలో సిటీ స్కాన్, ఎంఆర్‌ఐ, అల్ట్రాసౌండ్స్ స్కాన్, వంటివి సులభంగా చేయవచ్చున్నారు. పలు విషయాలను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ డివిఎస్ఎస్ .వర్మ, కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు సందీప్ కళాశాల విద్యాశాఖాధికారి జయలక్ష్మి, సాయిప్రియ, బి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

పట్నంలోని 24 వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో జొన్నపల్లి వీర్రాజు మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గ రాణి బుధవారం పరామర్శించారు. వీర్రాజు కోడలు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులకు ఛైర్‌పర్సన్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శ కార్యక్రమంలో కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్ షేక్ మస్తాన్ ఉన్నారు.

అర్జీలను సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమం లో అందిన అర్జీలను సత్వరమే పరిష్కారించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివద్ధి అధికారికార్యాల యంలో మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కలెక్టరు, హిమాన్షు శుక్లా, రెవెన్యూ డివిజనల్ అధికారి వసంతరాయుడితో కలిసి మండల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, పరిష్కారించవలసిందిగా ఆయా శాఖల అధికారులనుకలెక్టరు ఆదేశించారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర సమస్యలకు సంబంధించి సుమారుగా 51 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లా డుతూ అర్జీదారుని సంతప్తే ధ్యేయంగా పరిష్కార సర్లి ఉండాలన్నారు. లేని పక్షంలో దరఖాస్తు మరల రీ ఓపెన్ అయ్యేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ మండల పరిధిలోని చె లకాయి చెరువు సమీపంలో ఇ క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జెసి ఎస్.నుపూర్ అజయ్, సిపిఒ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డిఆర్‌డిఎ పీడీ వి. శివశంకర్ ప్రసాద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జివి.సత్యవాణి, డిపిఒ వి.కష్ణకుమారి, డిఇఒ ఎం.కమల కుమారి తదితరులు పాల్గొ న్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో అమలాపురం- హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారనిజిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వర రావు బుధవారం తెలిపారు. హెల్త్ ఫిట్నెస్ జిమ్ కు చెందిన బి.యశ్వంత్ 66 కేజీ ల విభాగంలో, పి.తరుణ్ తేజ్ 61 కేజీల విభాగంలో జిల్లాస్థాయిలో బంగారు పతకాలు, పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో పి.తరుణ్ తేజ్ 59 కేజీల విభా గంలో, బండారు కుమార్ 83 కేజీల విభాగంలో జిల్లాస్థాయిలో బంగారు పతకాలను గెలుచుకున్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యెను ముల కృష్ణ పద్మరాజు అభినం దించారు.కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చీకురుమెల్లి కిరణ్ కుమార్, పొనకల దుర్గ ప్రసాద్, మట్టపర్తి వెంకట సముద్రం, వాకపల్లి దొరబాబు, మారే వీరేంద్ర హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అమలాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహ ణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు చేస్తారని జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి పేర్కొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ లు వివిధ జిల్లాల వైద్య ఆరోగ్య సిబ్బం దిని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కష్ణబాబు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్‌లు అమరావతి నుండి 26 జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ సన్నద్ధత పై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ సచివాలయాల నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సుమలత, అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి. భరత లక్ష్మి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఆండ్రోస్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీప్తిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి-మామిడికుదురు

స్థానిక దీప్తి పాఠశాలలో బుధవారం విద్యార్థుల మీలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి, నమాజ్ చేసి ఒకరికొకరు ఆ లింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి, పండగ ప్రాముఖ్యతను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో దీప్తి విద్యాసంస్థల కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు

ప్రజాశక్తి-ఆలమూరు

మండల పరిధి 18 గ్రామాల్లో బుధవారం గణపతి నిమజ్జనాలు, లడ్డు పాటలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీను నాయక్ ఆదేశాల మేరకు ఎఎస్‌ఐ సూర్యచంద్రరావు, సిబ్బందితో పర్యవేక్షించారు. ఇందులో భాగంగా సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ పర్యవేక్షణలో చెముడులంకలో నాలుగు వీధుల జంక్షన్ వద్ద గణపతి ఉత్సవాల్లో లడ్డూను వైసిపి నేత ధనలక్ష్మి సప్లయర్స్ మేనేజింగ్ పార్టనర్ తమ్మన హరి, ఎర్రం శెట్టి వెంకటేష్ రూ.10 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో నేతలు రాయుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

లడ్డూతో వైసిపి నాయకుడు హరి

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్నగూడెం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ చెందిన వ్యాన్ డ్రైవర్ షేక్ అన్వర్ అలీ(35)మతి చెందాడు. గుంటూరు నుంచి కాకినాడకు వెళ్తున్న ఐసర్ వ్యాన్, ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. వ్యాన్ క్యాబిన్లో డ్రైవర్ ఆలీ ఇరుక్కుపోయి తీవ్ర గాయాలై మృతి చెందాడు. అలాగే గొల్లగూడెం వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన కారు ప్రమాదంలో పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన పాస్టర్ మొయ్య కృష్ణ(41) మతి చెందాడు. కృష్ణ తన సన్నిహితులైన మరో ఇద్దరితో కలిసి కారులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా గొల్లగూడెం వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ఐసర్ వ్యాను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

గణేష్ నిమజ్జనంలో అపశుత్రి

కాలువలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - ఆలమూరు

గణపతి విగ్రహ నిమజ్జనానికి వెళ్లి ఒక విద్యార్థి గల్లంతైన ఘటన బుధవారం మండలంలోని మడికి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మడికికి చెందిన అత్తిలి రాకేష్(22) సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ చదువుతున్నాడు. మడికి సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు స్థానికులతో కలసి పాల్గొన్నాడు. జాతీయ రహదారి చెంతన ఉన్న ప్రధాన కాలువలో వారితో కలిసి గణేశ్ నిమజ్జనంలో పాల్గొన్నాడు. అనంతరం స్నేహితులతో ఈత కొడుతుండగా రాకేష్ గల్లంతయ్యాడు. పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం ఉండూరుకు చెందిన సత్యప్రసన్న ఆనే వివాహిత ఈ నెల 22 నుంచి అదృశ్యమైందని ఆమె భర్త సురేష్ కుమార్ సామర్లకోట పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పదేళ్ల క్రితం సత్యప్రసన్నతో తనకు వివాహమైందని, తనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నెల 22న మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదని తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నిందితున్ని తీసుకెళ్తున్న పోలీసులు(వృత్తంలో వ్యక్తి)

పోలీసుల అదుపులో బాలిక హత్య కేసు నిందితుడు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలో తీవ్ర చంచలనం కలిగించిన పదేళ్ల బాలిక ప్రవీణకుమారి హత్య కేసులో నిందితుడు బత్తిన నానిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న స్థానిక ఎన్టిఆర్ కాలనీలో నివసిస్తున్న జ్యోతి తన పదేళ్ల కుమార్తె ప్రవీణకుమారి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐదు రోజుల అనంతరం బాలిక కట్టమూరు పుంత రహదారిలో శవమై కనిపించింది. అనుమానితుడైన జ్యోతి సమీప బంధువు బత్తిన నాని పరారీలో ఉండటంతో అతనిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు నిందితుని పట్టుకున్నారు. ఈ వార్త తెలిసిన వెంటనే అధిక సంఖ్యలో ప్రజలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని టపాసులు కాల్చారు. బాలిక కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు, ప్రజలు పోలీసులను అభినందించారు.

అవమానకరంగా మాట్లాడారని అధికారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మండపేట

సమాచారం కోరిన తనపై మండలంలోని ద్వారపూడి దేవాదాయ శాఖ ఇఒ ఉండమట్ల రాజేష్ దుర్భాషలాడి అవమానకరంగా మాట్లాడారని విలేకరి తాతపూడి సుధీర్ ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల దేవాదాయ శాఖకు చెందిన కొన్ని విషయాలపై తాను వివరాలు తెలియజేయాలని కోరానన్నారు. 'ప్రతి ఒక్కరికీ వివరాలు అడగడం అలవాటుగా మారిందని, దళితుడవైన నీకు ఆలయాల వివరాలు ఎందుకు?' అంటూ హేళనగా మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటానని ఎస్ఐ అశోక్ తెలిపారు. మీడియాకు హామీ ఇచ్చారు. సుధీర్ వెంట మండపేట ప్రెస్ క్లబ్ సభ్యులు రెడ్డి ఓమేష్, వేమగిరి నూకరాజు, పి.సుబ్బరాజు, ఖండవిల్లి పవన్ కుమార్, దార్ల స్వామి, మాండ్రు ప్రసాద్ చౌదరి, బూరా రాజ్ కిరణ్, వాసులు వున్నారు.

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

ఐదేళ్లుగా భూస్వామి వేధింపులు

- 20 వేల ఇటుకలను ధ్వంసం చేసిన వైనం
- రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వ్యవసాయకూలీ

బాధితుడు సత్యనారాయణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆయనో వ్యవసాయ కూలీ. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. అటువంటి సామాన్య కూలీపై భూస్వామి ఐదేళ్లుగా వేధింపులకు గురిచేస్తూ మానసికంగా వేధించడంతో పాటూ, ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. చేసేది లేక వ్యవసాయ కూలీ తనకు రక్షణ కల్పించాలంటూ కలెక్టర్‌ను ఆశ్రయించాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం అయితపూడికి చెందిన రాయుడు సత్యనారాయణ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇల్లు కట్టుకునేందుకు 20 వేలు ఇటుకను ఊరి చివర పోరంబోకు స్థలం వద్ద డంప్ చేశాడు. అదే గ్రామానికి చెందిన రైతు రాయపరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చక్రవర్తి తమకు పొలం వెళ్లే దారిలో ఇటుక వేశాడని, దానిని తొలగించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి పోలీస్ స్టేషన్ చుట్టూ సత్యనారాయణ తిరుగుతున్నాడు. పోలీసుల సూచనల మేరకు ఆ ఇటుకను వేరే చోట గుట్టగా పోసుకున్నాడు. అయినా ఆగ్రహం చల్లారని భూస్వామి ఇటుక తీయట్లేదంటూ పొక్లెయినర్‌ను ఉపయోగించి మొత్తం ఇటుకను రోడ్డు గుంతల్లో పోయించి మొత్తం ధ్వంసం చేశాడు. దీంతో చేసేది లేక తన ఇటుకను ధ్వంసం చేశారని పోలీసులకు, తహాశీల్దార్, గ్రామ కార్యదర్శికి బాధితుడు సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. అయినప్పటికి తనకు న్యాయం జరగలేదని, పైగా బెదిరింపులకు దిగుతున్నాడని బాధితుడు వాపోయాడు. అవసరమైతే తనను చంపి కేసు లేకుండా చేసుకోగలమని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని, ధ్వంసం చేసిన ఇటుకను తిరిగి ఇప్పించాలని ఇటీవల జరిగిన స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించానని తెలిపాడు. ఐదేళ్లుగా తనకు న్యాయం జరగలేదని, అధికారులు భూస్వాములు కొమ్ముక్కై తనను వేధించారని తెలిపాడు. జగనన్న ఇల్లు కట్టుకునేందుకు సిద్ధం చేసుకున్న ఇటుకను తిరిగి తనకు ఇప్పించాలని, తన కుటుంబానికి భూస్వాముల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని సత్యనారాయణ కోరుతున్నాడు.

భూస్వామి ధ్వంసం చేసిన ఇటుకలు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ, జెవివి పిలుపు

ప్రజాశక్తి - తుని

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ తెలిపారు. జెవివి, మద్య పానం వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో రాజా ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మద్యం, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై డిబేట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. ఒకసారి మత్తుకు అలవాటు పడితే అది మరణంతో సమానమన్నారు. చిన్న వయసులోనే చాలా మంది మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారన్నారు. మత్తుకు బానిసైన వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఎన్నో కుటుంబాలు, వారి పిల్లలను, పెద్దలను కోల్పోయాయని తెలిపారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అలాగే జిల్లాలో డి.ఎడిక్షన్ సెంట్రల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ సీనియర్ అధ్యాపకులు వీర ప్రభాకర్, రిటైర్డ్ హెచ్ఎం సుందర్ రావు ,జె.వి.వి నాయకులు కె.నాగభూషణరావు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కె.లోవరాజు,విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న సభ్యుడు

పట్టణాల్లో ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా భారత ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని డిఆర్ఒ సత్తిబాబు తెలిపారు. ఇందులో భాగంగా గ్రేటర్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్లాకుల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్ ఏర్పాటుకు జాగాలు లేని చోట్ల మూడు కిలోమీటర్లు పరిధి దాటి ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పు చేసేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియను సవరించిందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఒ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణ, విధివిధానాలను ఆయన వివరించారు. ప్రతీ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయిలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించడమే ప్రధాన అంశంగా సవరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతి ఏడాదీ ఆరు మాసాల పాటు జూన్ నుంచి డిసెంబర్ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని జనవరిలో తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ సవరణ ప్రక్రియలో 1500 ఓటర్లు దాటిన చోట అదనంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అవకావం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. ఈ సవరించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ అక్టోబర్ 27న జరుగుతుందన్నారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వరకూ అభ్యంతరాలు తెలియజేయొచ్చన్నారు. డిసెంబర్ 26న క్లెయిమ్స్‌ను పరిష్కరిస్తామనానరు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి ఓటర్ జాబితాను పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల సంఘం ఆమోదం అనంతరం జనవరి 5న తుది జాబితా ప్రచురిత మవుతుందన్నారు. ఇవిఎంల తనిఖీ 45 రోజులు పాటు ఉంటుందని ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన ప్రభాకర్‌రావు, యాళ్ల దొరబాబు, అల్లాడి స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ సత్తిబాబు

మున్సిపల్ స్థలాల ఆక్రమణపై నిలదీత

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ ఆరేళ్ల వీరరాఘవ మాట్లాడుతూ మహారాణి కళాశాల సమీపంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవడం అలవాటుగా మారిపోయిందన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో లేఅవుట్ యజమాని 86 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించాడన్నారు. ఇంతవరకు అతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాల రక్షణపై దృష్టి పెట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డులోని వినాయకుడి గుడి సెంటర్లో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో భవన నిర్మాణాల నుండి ట్యాక్స్ వసూలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ప్లానుకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా, అదనపు నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కరరావు మాట్లాడుతూ తన వార్డులో కల్వర్టు పూర్తిగా చెడిపోయి ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీని స్థానంలో నూతన కల్వర్టు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ప్రారంభానికి ముందు హత్యకు గురైన బాలిక ప్రవీణ కుమారి మతికి సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, మేనేజర్ జ్యోతి రాణి, డిఇ ఆదినారాయణ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, రెవెన్యూ ఆఫీసర్ చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

సమావేశంలో నిలదీస్తున్న కౌన్సిలర్

తాళ్లరేవు సిహెచ్‌సిలో 22 మంది రక్తదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 22 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్ సేవా పక్వాడాలో భాగంగా సిహెచ్‌సిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యురాలు శిరీష ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో కైట్, కోరంగి ఫార్మసీ కళాశాలల విద్యార్థులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, అద్దంకి లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు చిట్టూరి చలపతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విద్యార్థి దశ నుండి వినియోగదారుల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయడం మంచి పరిణామమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 9 రకాల అంశాలపై చైతన్యం కలిగించే పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు తూనికల్లో మోసాలు, కల్తీనీ కనిపెట్టడం, వినియోగదారుల హక్కులు, రక్షణ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ జి.గోవిందు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, సీనియర్ సైన్స్ టీచర్ ఎఎల్‌వి.కుమారి, క్లబ్ ప్రెసిడెంట్ ఆర్ శివ రామకష్ణ, సెక్రెటరీ బి.హారిక ,సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సి కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఇంద్రపాలెంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎస్‌సి కమ్యూనిటీ హాలుకు బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు 250 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ హాలుకు కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గీసాల శ్రీను భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎస్‌సిల చిరకాల కోరిక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇచ్చిన హామీని ఎవరూ నిలుపుకోలేదన్నారు. ఈ విషయాన్ని రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి రూ.40 లక్షలు మంజూరు చేశారన్నారు. ముందుగా రూ.10 లక్షలు విడుదల చేశారని, మిగిలినవి అంచలంచెలుగా విడుదల చేస్తారని శ్రీను తెలిపారు. ఆరు నెలల్లోగా ఈ హాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు గీసాల తెలిపారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఈ భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.రామేశ్వరరావు, బి.రాయ్, వాసంశెట్టి రాజేశ్వరరావు, కె.విజయ్, దేవరాజు, మానేపల్లి జ్యోతి ప్రకాష్, బీర ప్రసాద్, శాంతి సుకుమార్, గంటి సత్యనారాయణ, జానిపాటి అప్పారావు, ఆంజనేయులు, టి.నూకరాజు, పొన్నగంటి సీతామాలక్ష్మి, వాసంశెట్టి ప్రసన్న, అరిపిరాల శ్రీనివాసరావు, పలివెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బిసి కుల గణన నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్, సామర్లకోట రూరల్

బిసి కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల కాకినాడ నగరంలో పలువురు బిసి నాయకులకు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారంతా బుధవారం కాకినాడ ప్రభుత్వాసుపత్రి కూడలి వద్ద ఉన్న మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీలో బిసిల కులగణన చేసేందుకు తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కులగణన ద్వారా బిసిలకు ఎన్ని సీట్లు ఇస్తారనేది తెలుస్తుందన్నారు. బిల్లును పార్లమెంట్లో కూడా ఆమోదించి బిసిల మద్దతును ఇరు ప్రభుత్వాలు పొందాలని కోరారు. గతంలో బిసిల కులగణన కోసం ఎందరో ఉద్యమాలు చేశారని అది నేటికీ నెరవేరిందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఎంతో శ్రద్ధతో ఈ విషయాన్ని అసెంబ్లీలోకి తీసుకొచ్చారన్నారు. ఈ కులగణనను చేపట్టి వచ్చే అసెంబ్లీలో ఎన్నికల నాటికి సీట్లను వారి దామాషా పద్ధతిలో ఇవ్వాలని రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కండిపల్లి వెంకటరమణ, వాసంశెట్టి త్రిమూర్తులు, అనసూరి సతీష్, కొప్పిశెట్టి చంద్రమౌళి, రాయుడు నాగేశ్వరరావు, అనసూరి శ్రీను, మాచవరపు సత్యనారాయణ, విత్తనాల శ్రీను, సుందరపల్లి గోపాలకృష్ణ, తామరపల్లి దుర్గాప్రసాద్, వాసంశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. సామర్లకోట రూరల్ ఆవాల అప్పారావు వీధిలో బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా బిసి అయ్యాక కార్పొరేషన్ చైర్పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ మాట్లాడుతు హర్షం వ్యక్తం చేశారు.

అల్లవరం పశువైద్యశాల సందర్శన

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు బుధవారం అల్లవరం పశువైద్యశాలను సందర్శించారు. పశుసంవర్ధకశాఖ అమలుపరుస్తున్న ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అందించాలన్నారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని, పశువులకు సకాలంలో టీకాలు వేయాలని, పశుసంవర్ధక సహాయకులకు, పశుసంవర్ధక సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.మూర్తి,ఉపసంచాలకులు డాక్టర ఎల్.విజయరెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర ఎం.నారాయణరావు, డాక్టర్ ఎ.శివరామకష్ణ పశువైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఒవైసీ వ్యాఖ్యలపై ఆగ్రహం

ప్రజాశక్తి - మండపేట

టిడిపి అధినేత చంద్రబాబుపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసి వ్యాఖ్యలపై టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిములపై జరిగిన హత్యలు, అత్యాచారాల గురించి మాట్లాడకుండా వారిని పరామర్శించకుండా ఒవైసి నేడు చంద్రబాబు జైల్లో హాయిగా ఉన్నాడని వ్యంగ్యంగా మాట్లాడటం తగదన్నారు. యజమానులైన జగన్‌రెడ్డి, కెసిఆర్ ఇలా మాట్లాడాలని చెప్పారా? అని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్ర ముస్లిములు ఈరోజే మీకెందుకు గుర్తొచ్చారన్నారు. ఇంతకాలం మీరు ఏమయ్యారని ప్రశ్నించారు. అబ్దుల్ సలాం కుటుంబంతో ఆత్మహత్య చేసుకున్నా, కడపలో మైనారిటీ బాలికపై అత్యాచారం జరిగినా ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదు? అని ప్రశ్నించారు. ఇప్పుడు జగన్ ఇచ్చే ప్యాకేజీ కోసం చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలడం తగదన్నారు. మీరు చెబితే నమ్మే పరిస్థితిలో ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిములు లేరన్నారు. మీరు ఏ పార్టీకి బీ-టీమ్‌గా పనిచేస్తున్నారో అందరికీ తెలుసన్నారు.

'మనసు పరిమళాలు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి- కొత్తపేట

ప్రముఖ కవి, సివిల్ ఇంజినీర్, కొత్తపేటకు చెందిన జినిపే భీమారావు(చిన్ని) రచించిన 'మనసు పరిమళాలు' సిసింద్రీ కవితా సంపుటిని కలెక్టర్ హిమాన్షుశుక్లా తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభావంతమైన కవి కలం మనసు లోతుల్లోకి వెళ్లి మనస్సు పరిమళాన్ని అక్షరాలతో ఆవిష్కరణ చేశారన్నారు అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో నానీలు, హైకూలు, గాలిపటాలు, వంటి ఎన్నో ప్రక్రియలు వచన కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నాయని, కవి భీమారావు సిసింద్రీ ప్రక్రియ ద్వారా 211 కవితలు రచించి పుస్తక రూపంలో తీసుకొచ్చినందుకు కవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, నాని రాజు, సాహితీ వేత్తలు నల్లా నరసింహమూర్తి, బివివి.సత్యనారాయణ, మాకే బాలార్జున సత్యనారాయణ పాల్గొని కవిని అభినందించారు.

ఓటర్ జాబితా సవరణపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

కొత్తగా ఓటు హక్కు కోసం 124 దరఖాస్తులు అందాయని ఆర్‌డిఒ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.సీతారామారావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు 465 దరఖాస్తులు, ఓటర్ జాబితాలో మార్పులు, సవరణల కోసం 125 దరఖాస్తులు వచ్చాయన్నారు. చిరునామా మార్పుకు 161 దరఖాస్తులు అందాయన్నారు. ఓటర్ జాబితా రూపకల్పన ప్రక్రియలో 4629 చేర్పులు, 7355 తొలగింపులు జరిగాయన్నారు. ఈ సమావేశంలో పార్టీల ప్రతినిధులు జి.సూరిబాబు, ఆర్.సత్యనారాయణ, ఎన్.సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు, సిరపరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు

మాజీ సైనికులకు ఫెస్టివల్ గ్రాంట్‌కు ఆమోదం

ప్రజాశక్తి - యానాం

యానాంలో మాజీ సైనికులకు 2022-23 సంవత్సరానికి ఫెస్టివల్ గ్రాంట్ ఇచ్చేందుకు ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ ఫండ్ కమిటీ ఆమోదించిందని పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెస్టివల్ గ్రాంటును లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామన్నారు. లబ్ధిదారులు తమ ఐడీ కార్డు, బ్యాంకు అకౌంట్, లైఫ్ సర్టిఫికెట్ల వివరాలను వచ్చే నెల 20లోగా యానాం ఆర్ఎఒ కార్యాలయంలో అందజేయాలని, మరిన్ని వివరాలకు 0413-2253107 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పుదుచ్చేరి డిఐజీగా బ్రిజేంద్రకుమార్‌యాదవ్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి డిఐజిగా బ్రిజేంద్రకుమార్ యాదవ్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి రాజీవ్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్ఎఒ కార్యాలయానికి సమాచారం అందించామన్నారు. ఎజిఎంయు-2010 కేడర్‌కు చెందిన బ్రిజేంద్రకుమార్ ఇంతవరకూ సీనియర్ సూపరింటెండెంట్‌గా ఉన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యవసాయశాఖ, డిపార్ట్ మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ యానాం ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ బుధవారం రైతులకు కూరగాయల సాగు, కిచెన్ గార్డెనింగ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొని రైతులకు విత్తనాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ రైతులకు వరి పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని, వరి పంటనే కాకుండా వివిధ రకాల పంటలను సాగు చేయాలని కోరారు. అందుకు సంబంధించి సాగునీటికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు సాగునీటిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.గణేషన్, అగ్రికల్చర్ ఆఫీసర్ జోగిరాజు, ఫీల్డ్ ఆఫీసర్స్ ఖాన్, సుబ్బారావు, సబ్బతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

ప్రజాశక్తి - యానాం

గణపతి నవరాత్రులు ముగించుకుని యానాం పరిధిలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను స్థానిక యానాం ఫెర్రీ రోడ్ కోన సత్తియ్య జెట్టి వద్ద గౌతమీ గోదావరి నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి అగ్నిమాపక సిబ్బంది ద్వారా క్రేన్ సహాయంతో విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు. యువకులు డిజే పాటలతో, బాణ సంచా కాల్పులతో, వివిధ వేషధారణలతో ఊరేగింపులు నిర్వహించారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎన్టిఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిడిపిఒ జి.ఉష, ఎసిడిపిఒ ఎ.జ్యోతి ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న వైఎస్ఆర్ కిట్ ఉపయోగాన్ని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదివే ప్రీ స్కూల్ బాలలకు బడి వాతావరణం అలవాటు కావడమే కాక మానసిక వికాసం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ పిల్లలకు నాలుగు రకాల పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు పాపయ్యమ్మ, దుర్గా భవాని పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S. No. 13/2023

Between :
సూర్యవంశీ ప్రకాష్ ...వాది
మరియు
పసుపులేటి సీతారామలింగేశ్వరరావు వగైరాలు ...ప్రతివాదులు

ప్రతివాదులు :
1) పసుపులేటి సీతారామలింగేశ్వరరావు, S/o. వీరశంకరరావు, డో.నెం. 5-3-71, కొండప్ప వీధి, పిఠాపురం.

కోర్టువారి ఆర్డరుపై తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తమై సమన్లు పంపుతుండగా మీరు అందుకోకుండా ఉన్నందున ఇందుమూలముగా తెలియచేయునదేమనగా పై నెంబరు వ్యాజ్యము వాయిదా **ది. 01-11-2023న** ఉన్నందున, సదరు తేదీన పై కోర్టువారి ఎదుట మీరు **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా కాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని గ్రహించగలరు.

కొత్త మాణిక్యాలరావు
న్యాయవాది
పిఠాపురం. అన్నపూర్ణ థియేటర్ వెనుక,
ది.27-9-2023 కుంతి మాధవనగర్, పిఠాపురం

In The Court Of The IInd Additional Senior Civil Judge :: Kakinada
I.A.No. 800/2023, I.A.No. 801/2023
I.A.No. 802/2023 in O.S.No. 62/2017

Between:
Penkey Visweswara Rao, S/o. Apparao, Hindu, Aged 67 Years, D.No. 9-72, Chakirevu Meraka, H/o. Kajuluru.
...Petitioner /Plaintiff
AND
1) Anyam Govindu (Died) and Others
...Respondents /Defendants
TO: **9)** Karri Veera Venkata Rao, S/o. Not Known to the Petitioner, Hindu, Aged 52 Years, D.No. 6-13, Rice Mill Street, Kajuluru.
10) Karri Tulasi, D/o. Karri Veera Venkata Rao, Hindu, Aged 24 Years, House Wife, D.No. 6-13, Rice Mill Street, Kajuluru.
11) Karri Veena, D/o. Karri Veera Venkata Rao, Hindu, Aged 22 Years, House Wife, D.No. 6-13, Rice Mill Street, Kajuluru.

పై నెంబరు దావా పిటీషనులో 7వ ప్రతివాది /రెస్పాండెంటు అయిన కర్రి రత్నకుమారి చనిపోయినందున వారి వారసులు అయిన 9వ, 10వ మరియు 11వ రెస్పాండెంట్లును చేర్చుట కొరకు మరియు సదరు ఐ.ఎ.నెం. 800/2023, ఐ.ఎ.నెం. 801/2023, ఐ.ఎ.నెం. 802/2023 లలోని ప్రతివాదులు /రెస్పాండెంట్లుకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.04-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.RADHA KRISHNA
A.ANIL KUMAR RAJA
Advocates, Kakinada.
Cell: 94403 23951